# కొండె నాలుకకు

*-డా. బి. దామోదరరావు*

"అన్న వస్త్రాలకు పోటీ ఉన్న వస్త్రం ఊడిందట, గిట్లున్నది గీ దునియా భూ" ఇస్తారి మనసుల అనుకుంట ఏప చెట్టు కింద కూచున్నాడు.

"చంద్రన్న ఎదో మిషన్ తెచ్చిండటనే గది సూద్దాం వత్తావే ఇస్తారీ" అడిగిండు ముత్తడు.

"నీ యవ్వ దొయ్యలనీల్లు పారుత లేవురా రాత్రయితే తమాం పారలే, దోని చప్పుడే గాని దొప్పెడు పారకపోయే, గీ మిషిన్లు గిషిన్లు నాకెందుకే, గా పొలం దిక్కుపోక పోతే రేపు ఎనుకటిది ముందటేసుకుని తినాలె" అన్నాడు ఇస్తారి.

"గది కాదే గా మిషన్ల నీళ్లు ఎట్ల వస్తయో చూపెట్టరట, గా నీల్లను ఎట్ల వాడకం చెయాల్నో, చెప్తరట, గట్ల వాడుతే చుక్క బొట్టు నీళ్ళు వట్టిగ పోనట్నే, జర్ర సూద్దాం పా" అని బలవంత పెట్టిండు ముత్తయ్య.

ఇస్తారి, ముత్తయ్య ఇంక కొంత మంది చంద్రయ్య ఇంటికి పోయిన్రు. గాడ గిట్లనే ఆడ మొగ జమయిన్రు, గా మిషన్ 'టెలివిజన్' లెక్కున్నది.

మీట ఒత్తంగనే చెప్పుడు మొదలు పెట్టింది. 'ఒకప్పుడు మనది కర్మభూమి, ధర్మభూమి (గిప్పుడు కాదా జనంలో ఒకడు). యజ్ఞాలు చేసినా, యాగాలు చేసినా వానలు. పడేవి; అనేవాళ్ళు, ఇప్పుడు ఆధునిక యుగం, యంత్రాలే అన్నీ చేసే కాలం, మంత్రాలు, తంత్రాలు నడువవు. మీరు నీళ్ళు వృధా చేస్తున్నారు (నీల్లుంటే గదనే! మరోడు). రోజు గ్యాలన్ల కొద్దీ వట్టిగా పారబోస్తున్నారు'. మిషన్ చెప్పవట్టె. 'నీటిని ఈ విధంగా వాడుకోవాలే, ఇట్ల పైపులు వెయ్యాలే, ఇట్ల నీళ్లు చిమ్ముతయి, ఇట్ల అన్ని మొక్కలకు అందుతయి, ఇటల నీళ్ళు భూమిలోకి ఇంకుతయి, ఇట్ల పండుతయి' (చేను పండినట్లు, పండ్లు ధాన్యం రాసులుగా పోసినట్లు చూపెట్టగానే జనంలో సంబరం). కోతలు పూర్తయినయా! ఒకడి ప్రశ్న. 'అయింది, అగ్గో అది చూడు'. ఎవరో చెప్పిన్రు. బస్తాలకు ఎత్తినట్లు, వడ్లే వడ్లు. జనం అటే చూడవట్రి. గీ మిషన్ చివర్లో గిట్లన్నది- 'నీళ్ళు పోకుండా చెయ్యాలంటే, చాల ఖర్చయితది. మొదట్లో ఇరువై వేలు పెట్టుబడి పెట్తే చాలు. నీళ్ళు వృధా కావు. త్వరపడుండి' అని. 'కొండె నాలుకకు మందు వేస్తే ఉన్న నాలిక ఊడిందంట' గాయింత ఇట్ల ఉన్న నాల్గువొత్తులు ఖర్చు పెడ్తె, పోరగాల్లు బొట్టెగాల్లు, నోట్లో ఏలేసుకునుడే- ఓ పెద్ద మనిషి అన్నాడు. "నీ యవ్వ ఓ దిక్కు వానలు లేవు కరువు చాచి కొట్టవట్టె అని మేము దిక్కుతోచక సత్తా వుంటే గీ మిషన్ల పెట్టె మాకంతా ఊదరకొట్టి సెప్తే, నీళ్ల బొట్టు పుట్టలే, సంటోల్లకు తానాలు లేవు పానాలు లేవు. పెట్టిన పెట్టుబడి రాళ్ళ దెబ్బకు పాయే, ఎంకటిగాడు పురుగుల మందు తినె, నల్ల పోచయ్య ఉరి పెట్టుకునే. మాల లచ్చిగాడు, మైసరరాజి, తేళ్ళ లింగడు, ఉప్పరి రామయ్య, ఊరిడిచిపోయిరి. ఇంక ఏం పెట్టి గీ మిషన్లు కొంటమే. ఇంకెందుకే గీ మోతలు" మరో పెద్ద మనిషి అనకట్టె.

"ఎందుకెందే ఎదో సెప్పినట్టు, ఊర్ల వొంటి తిర్గకపోతే రేపు ఓట్లెట్ల పడ్తయే" సదువు కోసం పొలం అమ్ముకున్న పోరని కోసం.

జనమంతా ఇల్లల్లకు మల్లిన్రు. ముత్తయ్య, నారిగాడు, వెంకటయ్య తలోదిక్కు పోయిన్రు.

ఓరోజు కప్పలను ఊరేగించి, రోకళ్ళపై నీళ్లు పోసిన్రు, ఎగిరిన్రు, వానపడాలని, గంతులెసిన్రు. ఓరోజు పెద్ద ముత్తయిదువ మీద నీళ్ళు పోసి తడి బట్టలతో తిప్పిన్రు, గామే, దూస బాగయితుంది గిన్ని నీల్లు పొయ్యిమంటే, లింగం మీద నీళ్ల పోసిన్రు. ఇంటికో బిందె, దోసెడు, దోసెడు పోసిన్రు.

అయినా ఒక్క చినుకు వానలేదు.

నీటి బొట్టు లేదు. చేదబాయిలు, మోటబాయిలు బోర్లపడ్డయి. బోరుబొక్కల్లో,




జలమాయమైంది. తిండి తిప్పలు ఉండేటట్లు లేదు.

గాడ పట్నం ఉండేటోల్లు, పెద్ద పదవుల్లో ఉన్నోల్లు, తిన్నదరుగక, తిట్టుకుంటు కొట్టుకుంటున్నరు. నాయకులేమో ఊర్ల మీద పడ్డరు.

జాతర్లు, కొలుపులు, కొత్త తిర్గ అనిపించవట్టె. ఏం సేత్తే నీల్లు రావాలే, కండ్ల పొంటి నీల్లు రావట్టె. అందరు కలిసి ఊర్ల పెద్దయ్య గారు గోపాలాచార్యుల దగ్గరికి పోయిన్రు.

గాయిన అన్నడు– "ధర్మం పోయింది, న్యాయం పోయింది, నరకం రాకుండ ఎట్లుంటది. ఎన్నో కర్వులు చూసిన. గిట్ల జనాన్ని పట్టించుకోని కరువు ఎప్పుడు చూడలే. ఎవడ్ని చూసినా మాట్లాడుడే. హైటెక్కులనవట్టి, కంప్యూటర్లనవట్టి, పట్నాలకు లేని వన్నె తేవట్టి, గని గింతంత కరువస్తే ఎట్ల బతుకాల్నో, జనంకు చెప్పకపోయిరి. ఓ రెండేళ్ళుగా మీకు చెప్తనే ఉన్నా. పాపభారం, మనిషిలో స్వార్థం పెరిగిపోయింది. గిది సామూహికంగా జనాన్ని మింగుతది గది గత్తీర గావొచ్చు, కరువు కావొచ్చు, యుద్ధం కావొచ్చు, భూకంపం కావచ్చు, ఉప్పెన కావొచ్చు" అని ఆగిండు మంచినీళ్ళు తాగటానికి.

జనంలో ఓ సదువుకున్నోడు అడిగిండు– "అయ్యవారు గీ పాపానికి మాకు సంబంధం ఏమిటీ! ఊర్ల మేమంతా మంచిగానే ఉంటున్నాం కదా?" అని 'పంతులూ, జర్ర యిరాటపర్వం సదువుంది, వానలు పడ్తయి' అన్నాడు.

పంతులు నవ్వి– "గదంతా, మన తృప్తి నాయినా, నా మాట ఇనుండి అని. అయ్యో పిచ్చి నన్యాసి, నీవు మంచికుంటే అయిందా, అమాయకులు మంచిగనే ఉంటరు. ఈ ఊళ్ళో జనాన్ని దోచుకు తినే నాయకులు లేరా! బడి, గుడి, కాంట్రాక్టుల్లో, లక్షలు దిగమింగిన

పుణ్యాత్ములు లేరా! రోడ్డు వేయిస్తమని, మట్టి పోయకుండానే బిల్లులు రాబట్టుకున్నోళ్ళు లేరా! పనికి బియ్యం అంటూ, లెక్క లేకుండా దిగమింగిన దళారులు లేరా! వీళ్ళంతా మంచి వాళ్ళేనా!" అయ్యవారు అడిగిండు.

జనం ఒకళ్ళ మొఖాలు ఒకళ్ళు సూచుకున్నారు. "అవుని వద్దే, గాల్లంతా కలసి ఊర్లకు ఊర్లనే దోచుకుంటున్నరు. ఒక దిక్కు కర్వని మనం మిడుకుతుంటే, మనం ఎన్నుకున్నోళ్ళు, పాయసాలు మెక్కుకుంటూ, పట్టు పర్పులపై దొర్లుతూ, బార్లు, బీర్లు, కార్లు అంటూ, జల్సాలు చేయవట్టి" ఓ యువకుడు ఆవేశంగా అన్నాడు.

"మరి ఎట్ల పంతులూ! ఏం చేద్దాం!" అందరు అడిగిన్రు. అయ్యగారు, దేవుని పూజ మాత్రమే చెయ్యడు జనానికి ధర్మసూక్ష్మాలు చెప్తడు. వేదవేదాంగాలు సదివిండు. ఎం.ఎ., ఎల్.ఎల్.బి. చేసినోడు. పండితుడిగా పేరు పొందాడు. రాజకీయ, ఆర్థిక విషయాల్లో తలనెర్సిన వాడు. గాయ్యి మాట పది ఊళ్ళ పెట్టు రామబాణం.

గాయిన అన్నాడు కండువ సర్దుకుంట "ఇప్పుడు- నేను చెప్పిన పెద్ద మనుషుల్ని, నిలదీయండి! వాళ్ళు మారుతారా సరే! లేదా! ఊరి విడిచి వెళ్ళమనండి. గ్రామ బహిష్కరణే వారికి సరియైన శిక్ష. ఈనాడు ఊరు, రేపు దేశమంతా, ఇట్ల బహిష్కరణలు జర్గుతయి. దేశం సుభిక్షంగా ఉంటుంది. అప్పుడు, వాళ్ళు దోచకుండా మిగిలిన సంపదతో దేశం ఏబై, కరువుల్ని ఎదుర్కుంటుంది. గ్రామీణ సమాజానికి అధిక వనరులు లభిస్తాయి. హరితవనాలు, అభయారణ్యాలు ఏవి పల్చబడవు. అప్పుడు వర్షాలు కురుస్తాయి. నిరులు పండుతాయి" అన్నాడు ఆనందంగా, తన్మయంగా.

ఊర్ల జనమంతా కదిలిన్రు. రాత్రే చాటింపు చేసిన్రు. "దళార్లు, కాంట్రాక్టర్లు, దోపిడిదార్లు, లుచ్చా పనులు చేసేటోళ్లు, రెండు రోజుల్లో ఊరిడిచి వెల్లాలే" అని.

గంతే, మూడో రోజు ఇరా7టపర్వం సదువకపోయినా పెద్ద వాన పడ్డది.

''గిట్ల అన్ని ఊర్లల్ల జర్గాలె'' జనం సంబురపడ్డారు. ■

## నన్ను - నిన్ను

మనిద్దరమూ తీయించుకున్న ఫోటోలో నన్ను దర్జాగా
కూర్చోపెడతారు...
నిన్ను నా పక్కన అణిగి మణిగి నిల్చోమంటారు.
నన్ను నిన్ను 'ఏమే వుసేయ్' అని పిలవమంటారు.
నిన్ను నన్ను 'ఏమండీ మీరు' అని పిలవమని శాసిస్తారు.
సుమతి సావిత్రి దమయంతి మండోదరిల పాతివ్రత్య
కథలు తెలిసిన నేను నిన్ను భయపెట్టి పతివ్రతగా
వుంచుతాను
రావణాసురుడు దుర్యోధనుడు కీచకుల వంటి మగాళ్ల
దుర్మార్గాలు తెలిసినా నిన్ను నోరు విప్పనియ్యరు.
నన్ను నీ భర్తనని చెప్పకనే చెప్తయ్యి నీ మెడలోని
మంగళ సూత్రాలు నల్లపూసలు కాళ్లకున్న మట్టెలు.
నేను అర్థాంతరంగా చచ్చిపోతే నిన్ను నా జ్ఞాపకాలతోనూ
నా పిల్లలతోనూ శేష జీవితం గడపమంటారు.
నువ్వు పోతే నన్ను నీ చెల్లెలుతో బతుకు పంచుకోమంటారు.
ఎందుకీ తేడాలు... ఎప్పుడు పోతయ్యి ఈ తేడాలు.

-ఎ. సువర్ణ